శ్రీ శారదామాత ప్రసంగములు

(తృతీయ భాగము)

పారమార్థిక సాధన



శిష్యుడు: అమ్మా! యోగాసనములను, ప్రాణాయామమును అభ్యసించుట మంచిదియా?

అమ్మగారు: ఈ సాధనల వలన అమానుష మహిమలు కలుగును. దీనివలన సాధకుని పారమార్థికాభివృద్ధికి అంతరాయము కలుగును.

శిష్యుడు: ఒక పుణ్య స్థలము నుండి మఱి యొక పుణ్యస్థలమునకు బోవుచుండుట మంచిదియా?

అమ్మ : ఏదైనా నొకానొకచోట మనస్సునకు నిలుకడ కలిగెనేని,

తీర్థయాత్ర కవసరమే లేదు.
శిష్యుడు: ధ్యానము నా కసాధ్యముగా నున్నది. దయయుంచి
నా కుండలినీ శక్తిని ప్రభోదింపుడు.
అమ్మ: కాలక్రమమున అదియే మేల్కొనును. జపమును ధ్యానమును
చేయుచుండుము. కుండలినీ శక్తికి స్వయం వికాసము లేదు.
ఎడతెగకుండ ధ్యానము సాగిన కొలది, మనస్సు చాల నిశ్చలమగును
గనుక, ధ్యానమును విడిచిపెట్టుటకు నీవే యిష్టపడవు. ధ్యానము
చేయుటకు మనస్సు సుముఖముగా లేనిచో ధ్యానమునకు
దానిని నిర్బంధ పఱుపకుము. అట్టి స్థితిలో ప్రణామము లొనర్చి,
ధ్యానాసనము నుండి లేచి రమ్ము . నిజమగు ధ్యానము దానంతటదియే
కలుగవలెను.
శిష్యుడు: అమ్మా! ఎందుచే మనస్సు స్థిరముగా నిలువదు?
నేను భగవంతుని దలంప బయత్నించినపుడు, మనస్సు తదితర
విషయముల పైకి బోవుచుండును .
అమ్మ : మనస్సు ఐహిక విషయముల పైకి బావుట తప్పు . ఐహిక
విషయములు అనగా ధనము, కుటుంబము మొదలగునవి.
కాని మనస్సు సహజముగా మనము చేయుచుండు పనిని
గూర్చి తలపోయు చుండును. ధ్యానము సాధ్యము కాని యెడల జనము
చేయుము . జపమువలన పరమార్థము సిద్ధించును . మనస్సు ధ్యానము
నకు సుముఖముగా నున్న సరే. కాని బలవంతముగా దానిని ధ్యానమునకు
నియమింపకుము.
శిష్యుడు : ఏకాంత స్థలమున గాక మఠములోనో, కాశీ నగరములోనో యుండి
పారమార్థిక సాధనలను చేయుట ఎక్కువ ప్రశస్తమా?

అమ్మ: ఋషీ కేశము వంటి యేకాంత స్థలమున పారమార్థిక సాధనలను చేయుచో నీ మనస్సు బలీయమై అటుపిమ్మట నీ వెచ్చట నున్నను, నెట్టి సమాజములోనున్నను అణుమాత్రము చలింపవు. మొక్క లేతగా నున్నప్పుడు దానికి కంచెయో తడికయో రక్షణకై యుండవలయును. కాని పెరిగి పెద్ద చెట్టయిన తరువాత, పశువులవలన దాని కెట్టి హానియు కలుగజాలదు. ఏకాంత స్థలమున పారమార్థిక సాధన బహు ముఖ్యము. ఆత్మ వికాసమునకై కోరిక కలిగి నప్పుడెల్ల, ఏదైన సందేహముగాని చిక్కుగాని బయలు దేరినప్పుడెల్ల కన్నుల నీరు నించి భగవంతుని ప్రార్థింపుము. పరమేశ్వరుడు నీ హృదయమాలిన్యము నంతయు కడిగి వైచి, నీ మనోవేదనను నివారించి నీ కాత్మ వికాస మొసంగును .
శిష్యుడు: పారమార్ధిక సాధనలను చేయజాలని నీరసుడను.
మీ పాద పద్మము లే శరణముగా గైకొంటిని, నా యుద్ధరణము నకు అవసరమగు దాని నెల్ల మీరే యొనర్పుడు. చేతులు జోడించి "శ్రీ గురుదేవుడు నీ త్యాగ శక్తిని కాపాడును గాక! అని ప్రార్థించి, అమ్మగారిట్లు చెప్పిరి : "అయన నిన్ను జాగరూకులై రక్షించుచున్నారు. నీవు భయపడ నక్కర లేదు. శ్రీగురుదేవుల కార్యమును నిర్వహించుచు, పారమార్థిక సాధనలను కూడ చేయుచుండుము. పనిచేయుచున్నచో వ్యర్థాలోచన లేవియు కలుగవు. ఏ పనియు లేనివానికి అట్టి ఆలోచనలు కుప్పలు తెప్పలుగా బయలుదేరు చుండును.
శిష్యుడు: నా ఆరోగ్య రక్షణకై కొన్నాళ్ళ నుండి నేను యోగాసన ము లభ్యసించు చున్నారు. ఆహారమును జీర్ణించుకొను టకును, బ)హ్మ చర్య వ్రతావలంబనకును యోగాస నములు తోడ్పడును.
అమ్మ: ఆ విషయమున నీ వించుక జాగరూకుడవై యుండుము.

నీ వట్టి పమలను చాల కాలము చేయు చుండుచో, నీమనస్సునకు శరీరమునందు సక్తత కలుగవచ్చును. ఇట్లని
నీవీ యభ్యాసములను విడిచి పెట్టినచో నీ యారోగ్యమునకు భంగము కలుగవచ్చును. కనుక నీవీ విషయమున వివేకముతో ప్రవర్తింప వలెను .
శిష్యుడు: అమ్మా! నేను సాధనను దినమున కైదు లేక పదినిమిషములవరకు మాత్రమే జీర్ణశక్తి కొరకు చేయుచున్నాను.
అమ్మ: మంచిది. యోగా భ్యాసమును కొంత కాలము చేసి పిమ్మట విడనాడు చో , చివరకు నీ యారోగ్యము చెడ వచ్చునని హెచ్చరిక చేసితిని. నాయనా! నీకు బ్రహ్మజ్ఞానము కలుగునుగాక యని ఆశీర్వదించు చున్నాను.
శిష్యుడు: నేను ప్రాణాయామము కూడ కొంచెము చేయుచున్నాను . నేనా సాధనను చేయుచుండవచ్చునా?
అమ్మ: ఔను. కొంచెముగా జేయవచ్చును. కాని ఎక్కువగా చేసినచో, మెదడును నరములును, తాపోద్రిక్తములగును. మనస్సు దానంతటదియే స్థిమిత పడుచో, నిక ప్రాణాయామ మెందుకు?
శిష్యుడు: అమ్మా! కుండలినీ శక్తి మేల్కొనక పోయినచో, లాభమేమియు లేదు.
అమ్మ : నాయనా! అది యెంత నిజము. కుండలినీ శక్తి క్రమ క్రమముగా మేల్కొనును. భగవన్నామోచ్చారణము వలన నీకు సర్వమును లభించును. మనస్సు స్థిరముగా నిలువకున్నను కూడ, నీ వొకచోట గూర్చుండి భగవన్నామమును పదిలక్షల సారులు జపించ వచ్చును. కుండలినీ మేల్కొనుటకు పూర్వము అనాహత నాదము వినబడును,కాని శ్రీవిశ్వేశ్వరీ కటాక్షము లేనిదే యేదియు సిద్ధింపదు (నేటి వేకువజామున బహుశా శివదర్శన ప్రాప్తి నాకు కలుగదని తలంచు చుంటిని)

శిష్యుడు: అమ్మా! శిలావిగ్రహముతో మాకు తృప్తి కలుగదు.
అమ్మ : ఎంతమంది పాపులు కాశికి వచ్చి, ఆ శివవిగ్రహమును దాకి ముక్తులగు చుండుట లేదు ? ఆ మహాదేవుడు కొంచెమేని గొణుగుకొన కుండ అందరి పాపములను తన మూపున మోయు చున్నాడు.
భక్తుడు : పారమార్థిక సాధనల కెట్టి స్థలము తగినది? సాధకుడా సాధనల నెట్లు చేయవలయును?
అమ్మ : నీకు తగిన స్థలము కాశి, మనస్సును భగవంతుని పాదారవిందములందు స్థిరముగా నిలుపుటయే, భగవ ద్విషయికములగు యోచనలందు మనస్సు తగిలి యుండునట్లు చేయుటయే పారమార్థిక సాధనల ప్రయోజనము. ఆ పావన నామస్మరణను చేయుచుండుము.
భక్తుడు : జీవిత లక్ష్యమేమి?
అమ్మ : భగవత్సాక్షారము బడసి, తదేక ధ్యాననిమగ్నులై యుండుటయే మానవుల జీవిత లక్ష్యము. మీరు సన్న్యాసులు, భగవంతుని సొంతమని చెప్పదగినవారు. ఇహమందును పరమందును కూడ మీ ఆధ్యాత్మిక శ్రేయస్సును పరమేశ్వరుడు కాపాడుచుండును. మీరిక దేనిని గూర్చి ఆందోళన పడవలసిన అవసరం లేదు.
-నిరంతరము భగవంతుని ధ్యానము చేయుట సాధ్యమగునా?
కొంత కాలము పని చేయుడు. తక్కిన వేళల భగవంతుని ధ్యానింపుడు.
అమ్మ* నీనెల్లప్పుడును భోగవిషయముల చెంత నుండుచో , వానికి వశుడవు కావచ్చును - *దురహంకారులై జనులు తామే స్వతంత్రులుగ సర్వముచేయుచున్నట్లు తలంతురు. భగవంతునిపై ఆధార వారాధార పడనేపడరు. పరాత్పరుడు తనపై నాధారపడువారిని రక్షించును.

* సాధకు డెంతగా పారమార్థిక సాధనలను చేసిన నంత త్వరితముగా భగవత్సాక్షా త్కారమును బడయుదురు . అతడెట్టి యాథ్యాత్మిక సాధనను కూడ చేయక పోయినను, చిట్టచివరకు ముక్తి నొందును. ఇది నిజము. కాని ధ్యాన ప్రార్ధనలను చేయక కాలమును వృధాచేయువారికి పరమార్థాను భూతి కలుగుటకు ఆలస్య మగును. పారమార్థిక సాధనలను చేయుటకే నీవు సంసారమును పరిత్యజించితివి. కాని నీవీ సాధనలు నెల్లప్పుడు చేయజాలవు కనుక సత్కర్మ లొనర్చుట యావశ్యకము. ఆ కర్మను శ్రీగురు దేవుడే నీకు నిర్ణయించెనని నీవు భావింపవలయును. కఠిన నియమ బద్ధమైన జీవితము నీకు మంచిది కాదు కడుపునొప్పిచే బాధ పడుచుందువు.నీయాహారము విషయమై జాగ్రత్తగా నుండుము.

*గాలి మేఘముల నెగురు గొట్టునట్లు, భగవన్నామము సంసార విషయ తౌల్యమను మబ్బును పటా పంచలు చేయును.

*కేవలము పుస్తకము చదువుట వలన నెవరికైన భగవంతుని యందు నమ్మకము కలుగునా? అమితమగు గ్రంథ పఠనము వలన, చిత్త విభ్రమణము కలుగును. బ్రహ్మమే సత్యము, సంసారమనిత్యమను విషయమును గ్రహించుటకు మాత్రమే మానవులు మత గ్రంథములు చదువవలయును. కొన్ని వస్తువులను నా కొరకు తీసికొని రమ్మని నీకొక యుత్తరము వ్రాసితినను కొనుము. ఆ యుత్తరము నీ కెంత కాల మవసరము? దానిలోని సంగతులు నీకు తెలియునంత వరకే కదా ! అందలి విషయములు నీకు తెలిసిన తరువాత, నీకా యుత్తర మెందుకింక ? అప్పుడు నీవా వస్తువులను సేకరించి నా కడకు వత్తువు . అట్లు కానిచో నా యుత్తరమును రేయింబవళ్ళు చదువుట వలన లాభమేమి.

*మానవుని బుద్ధి అత్యల్పము. తనకు కావలసిన దొకటియై యుండ

వేరొకటి కోరును. వినాయకుని చేయ బోయి చివరకు కోతి బొమ్మను చేయును. కనుక కోరిక లన్నిటిని భగవంతుని పాదారవిందముల కడ సమర్పించుటయే యుత్తమము. మనకు బహు శ్రేయస్కర మైనదేదియో ఆ పరమేశ్వరుడే మన కొనర్చును. కాని మానవులు భక్తి, వైరాగ్యముల కొరకు భగవంతుని ప్రార్థింపవచ్చును. ఇవి కోరికలలో చేరవు. నిజముగా భగవత్సాక్షాత్కారమును కోరువారెందరు కలరు . అందుకు కావలసిన శ్రద్ధ యెక్కడున్నది.

*నాయనా! ఈ సంసారము అగాధమైన బురద మడుగువంటిది. అందొకసారి చిక్కుపడినవారు మరల బయటకువచ్చుట బహు కష్టము. బ్రహ్మ, విష్ణువులంతటి వారికి గూడ మతులు పోవును. ఇక మానవులను గూర్చి చెప్పుటకేమున్నది! భగవన్నామస్మరణ చేయుచుండుము. నీవట్లు చేయుచో, ఆ పరమేశ్వరుడెప్పుడో యొకనాడు బంధ విముక్తుని గావించును. నాయనా! పరాత్పరుడే యా బంధములను తొలగింపకున్న, నెవరికైన ముక్తి లభించునా! భగవంతునియందు పరిపూర్ణమైన నమ్మకమును కలిగి యుండుము. పసిబిడ్డ లెట్లు తమ తల్లిదండ్రులే తమకు దిక్కని భావింతురో, భగవానుని అట్లే భావింపుము.

*ధ్యాన, జప, ప్రార్థనలను గూడ చేయుట మిక్కిలి యావశ్యకము. అథమ ముదయమునను, సాయంకాలమునను , ఈ సాధనలను చేయవలయును. పడవకు చుక్కానివలె ఈ సాధన మానన జీవితమునకు మిక్కిలి యుపకరించును. సాయంకాల ప్రార్థనకై కూర్చుండు నపుడు, సాధకుడా పగలంతయు తాను సత్కర్మలు చేసెనో, పాపకర్మల నాచరించెనో వివేచన చేయవచ్చును. పిమ్మట నాత డానాటి తన మానసిక స్థితిని ముందటి నాటి తన మానసిక స్థితితో పోల్చి చూసుకొనవలయును. ఇంతేకాక, అతడు జపమొనర్చు నప్పుడు తన యిష్ట దైవ మూర్తిని

ధ్యానింపవలెను. ధ్యానమునందు మనకు మొట్టమొదట కను పడునది మన ఇష్టదేవత ముఖము అంతతో తృప్తి పడక మన మా మూర్తి నాపాద మస్తకము ధ్యానింపవలయును. మీమీ పనులతోపాటుగా నుదయమునను, సాయంకాలమునను మీరు ధ్యానము చేసిననే తప్ప, మీరు చేయునది సత్కర్మయో పాప కర్మయో మీకెట్లు తెలియ గలదు.

శిష్యుడు - పారమార్థిక జీవితమున ధ్యాన జపముల వలననే కృతార్థులము కాగలము, కాని కర్మవలన మనకేదియు 'సిద్ధింపదని కొందరందురు.?

అమ్మ: ఏ కొలది నాళ్ళో ధ్యాన జపము లభ్యసించు సాధకునకు సర్వము లభించునా? మహామాయ దయయుంచి, పరమార్థ సిద్ధికి గల అడ్డంకులను తొలగించిననే తప్ప నెవరికి, నేమియు లభింపదు. బలవంతముగా మితి మీరి ధ్యానము, ప్రార్థనలను చేయుటచే నొకనికి మతి చెడిపోవుటను మారు చూడలేదా? మతి చెడిన తర్వాత మనిషి జీవితమే నిరర్థకమగును. మానవుని మనస్సు బహు సూక్ష్మమైనది. ఏమాత్రము లోపము జరిగినను నెంత వానినైన నున్మాదుని చేయును. భగవంతు నెల్లప్పుడును స్మరించుచు సరియైన జ్ఞానము కొర కెల్లరును వానిని ప్రార్థించుచుండ వలయును. నిరంతరము ధ్యాన జపములను చేయ గల వారెందరున్నారు. కొందరారంభమందు పట్టుదలతో ఈ సాధనలను చేయుదురు కాని, ఎల్లప్పుడును చిత్రా సనములపై గూర్చుండుట వలన, వారి తలలు వేడెక్కి, గర్వాంధులై వివిధ విషయముల పైకి మనస్సుపోయి యెన్నో చింతలతో బాధ పడుచుం దురు . యథేచ్ఛగా మనస్సును తిరుగ నిచ్చుట కంటే పని చేయుచుండుటయే చాల మంచిది

ఆరీతిగ నిలుకడలేక తిరుగుటకు అవకాశ మబ్బిన మనస్సు వలన కలవరము కలుగును. ఈ విషయము లన్నిటి నాలోచించియే నా నరేను

జనులకు నిష్కామ కర్మ చేయుటకువీలగు సంస్థలను నిర్మించెను. ఒక చోటుకే ఎల్లప్పుడు కూర్చుండుటచే నతడు తన మనస్సు నెట్లు మలిన పరచు కొనుచున్నాడో నీవు చూచుచునే యున్నావు. అతని చాంధస భావములును, మూఢ విశ్వాసములను నానాటికి పెచ్చుపెరుగుచున్నవి. అతనెల్లప్పుడును తన మనోవ్యథలను గూర్చి మొఱపెట్టుచుండును. అంత చింత యెందు కుండవలయును? ఈ యనుభవము లన్నిటివలన నతనికి జ్ఞానోదయము కలుగు జాలదా?

*నిరంతరము ధ్యానము వలన మనస్సున కేకాగ్రత కలుగును.

ఎల్లప్పుడును నిత్యానిత్య వస్తు వివేచన చేయుచుండుము. ఎప్పుడైన నే విషయముపైనను నీ మనస్సు పోవుచున్నట్లు తోచెనేని, ఆ విషయా నిత్యతను గూర్చి తలపోసి నీ మనస్సును దాని నుండి భగవంతుని వైపునకు మరలింప బయత్నింపుము. ఒక మనుష్యుడు గాలము వేసి చేపలు పట్టుచుండెను. ఆ మార్గము ననే యొక పెండ్లి యూరేగింపు తాళ మేళములతో బోవుచుండినను కూడ, వాని దృష్టి యంతయు గాలము ముల్లు పైననే నిలిచియుండెను. ఊరేగింపును కీగ్రంటితోనైన నతడు చూడడయ్యెను.

అధ్యాత్మిక సాధనలు జేయుటకు తగిన చోటు నేర్పరచుకొనవలయును.

*ఏకాగ్రముగ నీ మనస్సు నిలిచినను సరే, నిలువకున్నను సరే, భగవన్నామస్మరణ చేయుచుండుము. ప్రతి దినము నిర్ణీత సంఖ్యప్రకారమా నామజపము చేయుచుండుట నీకు శ్రేయస్కరము.

*జప సంఖ్యయందే దృష్టి యుంచి జపము చేయుచో నీ మనస్సు సంఖ్య పైననే నిలువ వచ్చును. కనుక సంఖ్యను ప్రధానముగ పాటింపక, నీవు భగవన్నామముచేయుట మంచిది. జపము చేయనపుడు మనస్సు క్రమముగా లీనమగును. ఏకాగ్రముగా మనస్సు నిలువకున్నను,

నామస్మరణ మాన వలదు. విధాయకముగా నీవు చేయ వలసిన పని చేయు చుండుము. నామస్మరణ చేయునపుడు మనస్సు దానంతటదియే, గాలి తగులకుండ నొకచోట నుంచిన కొవ్వువొత్తి దీపము వలె, భగవంతుని పై స్థిరముగ నిలుచును. దీపము గాలికే చలించి కొట్టు కొనును. ఇట్లే మన భ్రమలును కోరికలును మనస్సును చెదరగొట్టును. మంత్రోచ్ఛారణ సరిగా లేని యెడల కూడ చిత్తమున కేకాగ్రత చేకూరుట ఆలస్యమగును. వెనుకటి కొక స్త్రీకి, రుక్మిణీ నాథాయ అను పవిత్ర నామ ముచ్ఛరింప గురువు బోధించెను. కాని యామె అంత పెద్దమాట నుచ్ఛరింపలేక 'రుక్కు రుక్కు' అని' స్మరణ చేయుచుండెను. అందువలన నామెకు కొలదినాళ్ళ వరకు అభివృద్ధి కలుగలేదు. కాని కొంతకాలమైన తరువాత భగవదనుగ్రహము వలన నామెకు సరియైనమాట స్ఫురించి, జపము ఫలించెను.
*స్వగృహమునందున్నపుడు సాధకుడు భగవన్నామ జపమును చేయుటకు ముందు శాస్త్రోక్తంగా తన మోమును కడుగు కొనవలయును. పరస్థలమున ఉన్నపుడు గురూపదేశించినమంత్రమును కూడా ఉచ్ఛరింపవలయును. మనోనిగ్రహము తో భగవన్నామము నొకసారి జపించుట, భగవత్పరము కాని మనస్సుతో లక్షసారులు జపించుట కంటే చాల మేలు. అన్య విషయములపై మనస్సు నుంచి నీవు దినమంతయు నామ జపము చేసినను దాని వలన విశేశ లాభము కలుగదు. మనస్సు నేకాగ్రముగా నిలిపి జపము చేసినప్పుడే మనకు భగవదనుగ్రహము కల్గును. భగవత్సాక్షాత్కారము కాలక్రమమున కలుగును. భగవాను నియందు భక్తి కలిగి వారి పాదారవిందములయిందే శరణు కోరుము. నిన్ను నిరంతరము రక్షించుచున్న తల్లిగాని తండ్రిగాని యెవరో యొక రున్నారని జ్ఞప్తి యందుంచుకొనిన చాలును.

*పారమార్థిక సాధనలను నియమిత కాలములందు సాధకులు తప్పక సాధన చేయవలయును.
*పనిలో మునిగి తేలు చున్నను, మన మధమము భగవంతుని స్మరించి నమస్కరించుచుండవలెను.
*సాధన కుత్తమ కాలము రేయుంబవళ్ళ సంధ్యా కాలము భగవత్ప్రార్థనకు మిక్కిలి యనుకూలము రాత్రి యంతరించి పగలు ప్రారంభమగును - దినమస్తమించి రాత్రి ప్రారంభమగుమ - ఇదియే దివారాత్రముల సంధి. ఈ సమయములందు మనస్సు నిర్మలముగా నుండును.
*మనో దౌర్బల్యము: ఇది ప్రకృతి నియమము. పూర్ణిమ, అమావాస్యలను నీవు చూచుచున్నావు కావా? ఇట్లే మరి కొన్ని వేళలందు మంచి సంస్కారములకును చెడు సంస్కారములకును, మరికొన్ని వేళలందు చెడు సంస్కారములకును లోనగు చుండును.
*మానసికముగా మంత్ర ముచ్ఛరింపుము. నీవేళ్ళును నాలుకయును క్రమక్రమముగా పనిచేయుట మాని వేయును. మనస్సు మాత్రమే పని చేయు చుండును. చివరకు మనస్సే గురువగును.
*విడువకుండ జపమభ్యసించువారికి భగవత్సాక్షాత్కారము కలుగును.
*తపోనిష్ఠ నభ్యసించుచున్నంత మాత్రమున నెవరినైన భగవత్కటాక్షము తప్పక కలుగవలెనను నియమమేదియు లేదు. పూర్వకాలమున ఋషులు వేలకొలది యేండ్లు తలక్రిందుగా, నడుగున నగ్నిజ్వాల నుంచి కొని ఘోర తపము చేసిరి. అట్లయినను వారిలో నే కొందరికి మాత్రమో భగవత్కటాక్ష ము కలిగెను.
శి : (భగవత్కటాక్ష ము)భగవద్దర్శనము ఎట్లు కలుగును?
అ: కేవలము భగవంతుని దయవలననే. కాని సాధకుడు ధ్యానమును, జపమును చేయు చుండవలెను. అందువలన చిత్త శుద్ధి కలుగును.

ఆరాధనాది పారమార్థిక సాధనలను ముముక్షువులు చేయు చుండవలెను. పువ్వును చేత బట్టుకొని ఆఘానించువారికి దాని పరిమళ మెట్లు తెలియునో, సానపై గంధపు చెక్క నరగదీయు వారికి మంచి గంధపువాసన యెట్లనుభవైక వేద్య మగునో అట్లే నిరంతరము భగవంతుని దలంచు చుండువారికి అధ్యాత్మిక వికాసము కలుగును. కోరికలన్నియు విడనాడుదువేని, నీవీ క్షణముననే భగవత్సాక్షాత్కారము బడయ గలవు.
*ఉదయము, సాయంకాలమునను ధ్యానమునకు గూర్చుండుము, ఉద్రేక మేమియు లేని చల్లని మనస్సుతో, ధ్యాన ప్రార్థనల నభ్యసింపుము. ఇట్లు చేయుట బహు కష్టము. దీని కంటె నొక పార పుచ్చు కొని మట్టిని త్రవ్వుట యెక్కువ సులభము. భగవంతుని దయలేక నీకేమియు లభింపదు.
*కొంత కాలమైన తరువాత నీ మనస్సే నీకు గురువై జ్ఞానవికాసము కలుగజేయునని గ్రహింపగలవు.
*మానవులారా! భగవంతుని శరణుజొరుడు. సర్వము వానికి సమర్పించి వాని శరణు జొరుడు! అప్పుడే మహా మాయ కనికరించి ముక్తికి దారి చూపును.
అమ్మ: సంసార మందేమి సుఖమున్నదో స్వానుభవము వలన నీవు గ్రహించిన విషయమే కదా ! ఇన్నాళ్ళ సంసార మందేల ఇంత వ్యామోహము? ఇంత పశుపువృత్తి యేల? దీనివలన నీకు కలుగుచున్న సుఖమెట్టిది? ఆదర్శనీయమైన పవిత్రజీవనమును నీవు కలలోనైన నూహింపలేవా? నీవును నీ భర్తయు నిప్పటికైన సోదరీ సోదరులవలె జీవింపలేరా? పందులకుతగిన జీవనముపై నింత భ్రమయేల? ఈ ప్రపంచ దుఃస్థితి జూడ నాకు మరణవేదన వలె నున్నది. "బ్రహ్మ చర్య మవలంబించి పవిత్ర జీవనము గడుపువారికి, వారు ప్రార్థించినను

సరే, ప్రార్థింపకపోయినను సరే భగవత్సాక్షాత్కారము చాలా త్వరితముగా కలుగును. ఇతరులు సంసార పాశ బద్ధులగుటచే, భగవంతుని ధ్యానింప బయత్నించినను 'వారి కాపని కష్టమని పించును" సన్యాసి తల్లికి హితోపదేశము :- " సన్యాసికి తల్లిగా నుండుట అనన్య సామాన్య మగు మహాభాగ్యము. చూచి చూచి జనులొక యిత్తడిగిన్నెను కూడ విడిచిపెట్టలేరే! దానిపై వారికి మమకారము పోదా? ఇట్టి స్థితిలో సంసారమును విడిచిపెట్టుట సులభమా? అటువంటి సుపుత్రుని తల్లివి నీవు. నీవెందుకు చింతపడవలయును? అతడు సాధువైనను నీ యోగ క్షేమము కనిపెట్టుచుండును.

*ఈ కలియుగములో మానసిక పాపము పాపమేకాదు. ఈ విషయమున చింతల నెల్ల విడనాడుము. గృహస్థులకు బహిరంగ త్యాగమక్కర లేదు. అంతరంగిక త్యాగము వారికి దానంతటదియే లభించును.

కాని కొందరి విషయములో బహిరంగ త్యాగ మావశ్యకము.

*మనస్సు సహజముగ పాపకార్యములు చేయ గోరుచుండును. సత్కర్మాచరణయందది సోమరి. సతర్మలను జయ ప్రదముగ నాచరింపవలయుననిన నోరిమియు పట్టుదలయు నావశ్యకములని నేను చెప్పుచుందును.'పరమేశ్వరా! చంద్రునకు గూడ కళంకమున్నది. నామనస్సు నెట్టి కళంకము గాని లేకుండునట్లను గ్రహింపుము' అని ప్రార్థించెడి దానను .

శి : భగవంతుడే మనకందరికిని తల్లియు దండ్రియునైన యెడల, మనచే పాపమేల చేయించుచున్నాడు?

అ: నిజమే ! ఈ చరాచర జీవులెల్ల భగవంతుడే. కాని భేదాత్మక ప్రపంచములో జీవులు తమ తమ పురాకృత కర్మకును ఆంతరంగిక సంస్కారములకును అనుగుణముగా వ్యవహరించుచు సుఖదుఃఖము

లనుభవించు చున్నారు. ఒకే సూర్యుడాయా వస్తు, స్థలములను బట్టి యే వేర్వేఋ విధములుగా ప్రకాశించు చున్నాడు.
శి : సర్వమును భగవత్సంకల్పము ప్రకారమే జరుగుచున్న
యెడల, కర్మసూత్రమును తప్పించు కొనుటకు
భగవంతుడు మనకేల సాయము చేయకున్నాడు?
అమ్మ : ఔను. భగవద్సంకల్ప మట్లున్న యెడల, మన యాధ్యాత్మిక వికాసము త్వరలో చేకూరును. కాని మనకు వాని సంకల్పము తెలియదు. ఈ కర్మ సూత్ర ఫలితముగా తుదకు శ్రీరామకృష్ణులు కూడ బాధ పడ వలసిన వారైరి; వారు కూడ పూర్వకర్మ ఫల మనుభవింపక తప్పినదికాదు.
శి: భగవన్నామ జపము వలన ప్రారబ్ధ కర్మ ఫలమును తప్పించుకొన వీలగునా!
అ: ఎవరైనను ప్రారబ్ధకర్మఫల మనుభవింపక తప్పదు. దీనినెవరును తప్పించుకొవజాలరు. కాని భగవంతుని పవిత్ర నామ జపమువలన, స్మరణవలన దాని తీవ్రత తగ్గును . ప్రారబ్ధమును బట్టి కాలు పోవలసిన వానికి, భగవద్ధ్యాన ఫలితముగా పాశమలలో నొకముల్లు గ్రుచ్చు కొనుటతో సరిపోవును.
*ఈ కలియుగ సత్యవ్రతమునకు మించిన తపస్సు వేఱేదియు లేదు. సత్యవ్రత భంగము లేకుండ నడచుకొను వారు భగవత్సాక్షాత్కారము బడసెదరు.
అమ్మ: "శ్రీగురుదేవులు నిజముగా ముమ్మాటికిని భగవంతుడే . ఇతరుల దుఃఖములను, కష్టములను తొలగించుటకై యా దయానిధి ఈ లోకమున ప్రజల బాగోగులను స్వయముగా తెలిసి కొనుటకై మారువేశము తో తన నగరమందు తిరుగు రాజువలె వ్యవహరించెను; తని నిజ స్వరూప మాలోక

మునకు దెలియుట తోడనే , అందుండి యింతర్ధానమయ్యేను" అని శ్రీ మాతృ దేవి యొక భక్తునితో జెప్పిరి.
*తన యేకైక పుత్రికను కోల్పోయిన యొక యువతి నోదార్చుచు శ్రీమాతృదేవి యిట్లనిరి. "అమ్మాయీ ? నీకు నేనేమి చెప్పగలను? నాకేమియు తెలియదు. శ్రీగురు దేవుని చిత్ర పటము నీయెదుట నుంచుకొనుము. వారెల్లప్పుడు నీకు తోడు నీడయైయున్నారని గ్రహింపుము. దుఃఖపూరితమైన నీ హృదయమందలి వేదనను ఆయనకు విన్నవింపుము, కన్నుల నీరు నించి ' ఓ ! ప్రభూ! నన్ను నీ యొద్ద కాకర్షించి, నామనస్సునకు శాంతి నను‌గ్రహింపుము ! అని త్రికరణ శుద్ధిగా ప్రార్థింపుము. నిరంతరమట్లు చేయుట వలనను మనస్సునకు క్రమముగా శాంతి కలుగును. శ్రీగురుదేవుని యందు భక్తి కలిగి, నీకు కష్టము వచ్చి నప్పుడెల్ల వారితో చెప్పుకొనుము.
అమ్మ : " తుదకొక్క సారి యైనను నిజముగా శ్రీగురుదేవుని ప్రార్థించినవారే విషయమున గాని భయపడనక్క లేదు.
శ్రీవారి నెల్లప్పుడును ప్రార్థించువారికి శ్రీభగవానుని దయవలన ప్రేమ భక్తి కలుగున్ను. అమ్మాయీ! ఈ ప్రేమయే పారమార్థిక జీవిత రహస్యము. శ్రీ బృందావన గోపస్త్రీల కిది సిద్ధించెను. వారికీ లోకమున శ్రీకృష్ణుడు తప్ప వేరేదియు తెలియ దయ్యేను. 'అమూల్యమైన ఈ ప్రేమ భూషణమును జనులు బహు జాగ్రత్తతో కాపాడుకొనవలయును. అని మూడు విషయములందు జాగరూకులై యుండవలెను. మొదటిది, నదీ తీరమున నుండు గృహము ; ఎప్పుడైనను నది పొంగి నీ యింటిని నాశనము చేసి వరదలో తుడిచి వేయవచ్చును; రెండవది, పాము నీ కంట బడినప్పుడు నీవు బహు జాగ్రత్తగా నుండవలెను అది యెప్పుడు వచ్చి

నిన్ను కరచునో యెవరును చెప్పలేరు; మూడు, సాధువు: అతని మాటలవలన, తలంపు వలన గృహస్థునకు కీడు కలుగ వచ్చునన్న సంగతి నీ వెరుగవు. సాధువును చూచినప్పుడెల్ల నీవతనికి గౌరవము కను బరుపవలయును. ప్రతివచనములచేగాని, న్యూనత కలుగచేయు సంభాషణలచే గాని నీ వాతనిని నిరాదరణ చేయగూడదు!'

*శిష్యులు చేయు పాపము వలన గురువు బాధపడును.

మంత్రమును ప్రతి దినము నిర్ణీత కాలములందు తప్పక జపించు చుండుము.

*నా శరీరము విచ్ఛిన్నమైనను, నేను బాధ్యత వహించిన శిష్యులలో ప్రతివ్యక్తికిని ముక్తి లభించనంతవరకు నాకు విడుదల యుండగలదని తలంతువా? అంతవరకు నేను వారితో నిరంతరము నివసింపవలెను. వారి పుణ్యవిషయమున పాపపుణ్యముల బాధ్యతను నేనే పూర్తిగా వహించి యున్నాను. మంత్రోపదేశము చేయుటయనిన అంత తేలిక పని యనుకొను చుంటివా ? మేము వహింపవలసిన బాధ్యత యెంత ప్రచండమైనది. శిష్యుల విషయమున మేమెంత ఆందోళన పడుచుందుము! చూడుము మహాత్ములను సేవించునపు డెవరైనను ప్రమాదమునకు లోను కావచ్చును. ఆ ప్రమాద మిట్లు జరుగును. అట్టి మహనీయుల సేవా భాగ్యమను భవించు వానికి గర్వ మెక్కువయై , తాము సేవించు వ్యక్తి నతడు తన చేతి కీలు బొమ్మల వలె నాడించి ప్రతి విషయమునను తుద కాహార విహారాదులందు కూడ తన యధికారమును చెలాయింపగోరును . దీని వలన సేవా ఫల మా సేవకుడు కోల్పోవును. తమ స్వసుఖములను మఱచి, తాము సేవించు పెద్దల కష్టసుఖములే తమ కష్ట సుఖములుగా భావించు వారి విషయమున నిట్లేల జరుగవలయును? సేవకుల పతనమును

గురించి నీవు మాట్లాడుచున్నావా? చాల మంది మహాత్ములు మిక్కిలి వైభవోపేతమైన జీవితమును గడుపు చుందురు. ఈ భాగ్య భోగ్యములను జూచి చాలా మంది మహాత్ములు వారి కడకు సేవకులుగా వచ్చి, భోగోన్మత్తులై తమగోతిని తామే త్రవ్వుకొనెదరు సరియైన విధమున సేవ చేయు వారెందరున్నారో చెప్పుము. చెఱువులోని నీటిపై చంద్రుని ప్రతిబింబము పడినతోడనే నీటియందు ప్రతిబింబితమైన చంద్రుడు నిజముగా తమ కూటములోని జీవియేయని భ్రమించి ఆనంద పారవశ్యమున నెత్తాళ్ళు(ఒక విధమైన చిన్న చేపలు) అటునిటు దుముకును. కాని చంద్రుడస్తమించి నప్పుడవి తమ పూర్వస్థితి లోనికి బోవును; వెర్రి సంతోషముతో నెగిరి యెగిరి అలసిపోయి మాంద్యముగా నవి పడి యుండును. దీనికంతటికిని కారణమేమో యవి గ్రహింపజాలవు.

*మరణ మెప్పుడు వచ్చునో యెవరికిని తెలియదు గనుక, జనులు తమ పవిత్రోద్దేశములను సాధించుటకు తగిన యవకాశము కలిగిన తోడనే శుభముహూర్తమునకై వేచి యుండక కార్యాచరణకు గడంగవలయును.

*వైరాగ్యమును అనగా నెట్టి కోరికయు లేని స్థితిని మనము కోరవలెను. ఏలన ఆశయే సర్వ కష్టములకు మూల బీజము. బహు జనన మరణములకు కారణము, ముక్తి కంతరాయము.

ఏ మానవ వ్యక్తిని గాని ప్రేమించు నెడల నీ వందులకు కష్ట పడవలసి యుందువు. భగవంతుని మాత్రమే ప్రేమించువారు నిజముగా ధన్యులు. భగవంతుని ప్రేమించుట యందెట్టి కష్టమును కలుగదు.

*మీరెప్పుడైన నొక చోటి నుండి మరియొక చోటునకు వెళ్ళునపుడు మీ చుట్టు ప్రక్కల నుండు వస్తువులను చక్కగా పరిశీలించి, మీరుండు స్థలమును నేమి జరుగు చున్నదో బాగుగా తెలిసి కొను చుండుము. కాని

నోరు మాత్రము మీరెన్నడు మెదపవలదు.
*కష్టాలెల్లపుడు వచ్చును గాని, శాశ్వతముగా నుండవు. వంతెన క్రింద నీళ్ళవలెనవి గతించి పోవునని గ్రహింపుము.
*మాటల చేనైన మన మితరుల నెన్నడును నొప్పింప గూడదు. కష్ట భాజనమగు సత్యమునైనను మనమనావశ్యకముగా పలుక కూడదు. ఎవరైన మోటు మాటలాడుట కలవడిరేని వారి స్వభావము కూడ మోటు బాఱును. తన మాటల నదుపులో నుంచు కొనలేని వానికి, సౌమ్యత ముండదు. ' ఒక కుంటివానిని వాడెట్లు కుంటివాడయ్యేనని" మన మడుగ కూడదు !
*ఎంత కొలది పాటి వస్తువుపైన మనము నిరాదరణ చేయరాదు. నీవొక వస్తువును గౌరవించు నెడల, అది గూడ నిన్ను గౌరవభావముతో చూచును. ఎంత చిన్న పనినైనను మనము గౌరవ భావముతో చేయవలయును. శిరస్సు గురు స్తానము. తలనెవరు పాదముతో తాకగూడదు.
*ఎపుడు నీ బుద్ధి అజ్ఞానమనెడి కాలుష్యమును దాటి పోగలదో 'అపుడు నీవు వినిన దాని నుండియు, విని తెలిసికొన వలసిన దాని నుండియు, వైరాగ్యము నొందెదవు. అని భగవద్వాక్యము. జ్ఞాన సంపన్నులైనచో శాస్త్ర శ్రవణపఠనాదులతో పనియేమి? జ్ఞానము లేక ఎంత కాలము ఎన్ని శాస్త్రశ్రవణ పఠనాదులు చేసినను దానివలన ప్రయోజనమేమి? పెక్కురు వక్తలు, శ్రోతలు కూడ సంవత్సరముల పర్యంతము వేదాంత ప్రసంగములలో మునిగి తేలుచున్నను తమ బుద్ధులు సైతము సంస్కరింప బడక పోవుట మిక్కిలి లజ్జాకరమైన విషయము .
*చిత్త శుద్ధికై కర్మలు, ఏకాగ్రతకై ఉపాసలు, ముక్తికై జ్ఞానము ఏర్పడినవి.@

జ్ఞానాగ్ని చేత సంచిత కర్మలు, ఆగామి కర్మలు దగ్ధమైపోవుచున్నవి. కాగా ప్రారబ్ధాను భవము పూర్తియైనంతనే విదేహమోక్ష మేర్పడుచున్నది.
*సంచితమనగా గడచిన అనంత జన్మలలో చేసిన పుణ్య పాప కర్మల రాశి, ఆగామి యనగా ఈ జన్మములో చేసి ముందు రాబోవు జన్మలలో అనుభవించవలసిన కర్మల రాశి. ప్రారబ్ధమనగా సంచితములో కొంత భాగమై ఈ జన్మమునకు తగిన ఫలమీయ నారంభించిన కర్మలు, ఇంత కంటె వేరు కర్మలు లేవు. నేను నిష్క్రియమగు ఆత్మను అని ఇట్లు అనుభవము కలుగగానే సంచిత, ఆగామి కర్మలన్నియు నశించిపోవుచున్నవి. ఇకను మిగిలినవి ప్రారబ్ధ రూపములు. ఈ రూపములు. ఇవి ఈ జన్మలో అనుభవింపగా అంతము నొందుచున్నవి. ఇట్లు సమస్త కర్మలను నశించిపోగా పునర్జన్మకు హేతువైన కర్మలేవియు లేనందున ఈ దేహము పడిపోయిన వెంటనే "తస్య తావదేవ చిరమ్" అని శ్రుతి యన్నట్లు ఏమియు ఆలస్యము లేకుండా మఱల జన్మించుట యనునది లేని విధముగా పునరిత్థాన రహితముగా అఖండ సచిత్సుఖరూప బ్రహ్మముగా ఉండిపోవుట యనెడి విదేహముక్తి ఏర్పడుచున్నది.
“జ్ఞానాగ్నిస్సర్వ కర్మాణి భస్మనాత్కురుతే " అని భగవద్వాక్యము.

దృక్కు - బ్రహ్మము.. .. దృశ్యము - మాయ
జ్ఞాన స్వరూపము - జాడ స్వరూపము
ఆనంద స్వరూపము.. దుఃఖ స్వరూపము
ఎల్లప్పుడును ఉండు నది.. ఎల్లప్పుడును ఉండనిది
ఆకారము లేనిది.. ఆకారము గలది
స్వతఃగానే తోచునది.. స్వతఃగానే తోచనిది
ఖండ ఖండముగా నుండనిది.....ఖండ ఖండము గానుండునది

కనబడనిది .. ..కనబడునది
తెలిసికొనునది .. .. తెలిసి కొనలేనిది
సత్యమైయున్నట్టిది .. సత్యముగానిది.

- అవిద్య (అజ్ఞానము) ఉపాధి - జీవుడు
- మాయ ఉపాధి కలవాడు - ఈశ్వరుడు

*ఎవడెటి కర్మ చేయుచున్నాడో, ఎట్టి ఆచరణ గలవాడగుచున్నాడో అతడు అట్లే యగుచున్నాడు. దొంగతనము చేసి దొంగయగు చున్నాడు.. ధర్మము చేసి పుణ్యాత్ముడగు చున్నాడు. బ్రహ్మజ్ఞానముసంపాదించి బ్రాహ్మణుడగు చున్నాడు.

1. దైవమును గూర్చి సదా తెలుసుకొనుప్రయత్నము
2. తెలుసుకొనిన విషయములను మనసున ఎల్లప్పుడు నిల్పుకొని విచారణ చేయుట.
3. శ్రద్ధాభక్తులతో భగవంతుని ధ్యానించుచు వానియందు లీనమగుట.

ఇదియే శ్రవణ, మనన, నిధి ధ్యాసలు.

*జ్ఞాని హృదయము పవిత్రమైనది . అతడు పెక్కు జన్మలలో సత్కర్మలు, ఉపాసనలు, వివిధ ఉత్తమ సాధనలు చేయక జ్ఞానమే కలుగదు. ఇది శాస్త్రనిర్ణయము, కాని సాధనలు చేసి చేసి జ్ఞానము కూడ కలిగి జ్ఞాని హృదయము పరమ పావన మైనదిగా తయారయి ఉండును.

“బ్రహ్మ భూతః ప్రసన్నాత్మా"

బ్రహ్మ విదుడు ప్రసన్నమైన - స్వచ్ఛమైన నిర్మలమైన అంతః కరణము గలవాడు అని భగవానుడు ప్రశంసించెను. కావున వాని యొక్క అట్టి పవిత్ర హృదయమున అపవిత్రమైన సంకల్పములు పాపపు ఆలోచనలు కలుగ నేరవు.

"అసంగాత్మ నిష్ఠులు పుణ్యము చేసి అభివృద్ధి గాని, పాపముచేసి హానిని గాని పొందరు." అనెడు యీ వాక్యమునకు అర్థమేమి? అనిన పూర్వము అజ్ఞాన దశలో చేసిన పుణ్యపాపములు ఆత్మసాక్షాత్కారమైన వెనుక అట్టి జ్ఞానిని ఏమియు చేయజాల వనియే అర్థము.

"సర్వపాపహరమగు ప్రాయశ్చిత్తము జ్ఞానమే "

*చేసిన కర్మ ఎప్పటికైనను అవశ్యము అనుభవించి తీరవలసినదే. ఇది ఈశ్వరశాసనము. అట్లైనను బ్రహ్మజ్ఞానము ఈ శాసనమును కొట్టివేయుచున్నది. తెలిసియు తెలియకయు చేసిన పాపములన్నియు బ్రహ్మజ్ఞానము కలిగిన వెంటనే అంత మొందు చున్నవి. నీవు పాపులలో కెల్ల మహా పాపి వైనను బ్రహ్మజ్ఞానమనెడి తెప్పను బడసి పాపమనెడి సాగరమును దాటిపోగలవు అని భగవద్వాక్యము .

****

నమో భగవతే వాసుదేవాయ

బ్రహ్మానంద వైభవము

*సామాన్యమైన నిద్రయందే మనుజుడు గొప్ప సుఖమును బడయు చున్నపుడు ఇక సమాధి స్థితి యందు వేరే చెప్పవలయునా? నిద్రయందు మనస్సు లయించినను అది జడస్థితి, తమోమయస్థితి కాబట్టి అది అంత గొప్పస్థితి కాదు. పశువులు కూడా నిద్రపోవుచున్నవి కదా. మేలుకోని మనస్సును లయింప జేయవలయును. అదియే మహోన్నత సమాధి స్థితి . అదియే ఆత్మస్థితి. బహుకాల ప్రయత్నము చేతను సాధనాభ్యాసము చేతను, వైరాగ్య భావన చేతను అట్టి తురీయ స్థితి తప్పక చేకూర గలదు.

*ఎన్ని నదులు వచ్చి సముద్రములో పడినను సముద్రము తృప్తి నొందనట్లు మనస్సున్ను ఎన్ని ప్రాపంచిక సుఖముల ననుభవించినను, తృప్తిని, శాంతిని, పొందకయే ఉండును. జీవులు దుఃఖమునుండి తప్పించు కొనుటకు ఉపాయము విచారణచే , వివేకముచే ఆ అజ్ఞానమును తొలగించు కొనుటయే యగును.
*ఆకలి - భోజనము చేయుట అనునది రోగనివారణ కార్యమే;
దాహము - నీరు, ఇతర పానీయములు రోగనివారణ కార్యమే
* చంచల సుఖములను గొప్పగా తలంచరాదు. రోగనివారణ కృత్యములను భోగములుగ భావించరాదు. విషయ సుఖములకు జీవిత పరమావధిగ నెంచరాదు. అక్షయమైన సుఖము ఆత్మ యందే కలదు. బ్రహ్మమందే కలదు. బాహ్య పదార్థములందు లేదు. ఉన్నదని తలంచి మోసపోరాదు.
*ఏ బ్రహ్మానంద సముద్రము యొక్క లవలేశమును గ్రహించి ఇంద్రుడు మొదలైన వారు పరమానంద పడుచున్నారో, దేనిని తమ హృదయ మందనుభవించుచు. మునీశ్వరులు పరమశాంతిని బడయుచున్నారో, నిత్యమైన ఏ సుఖసాగరమున తమ బుద్ధిని లయింప జేసి బ్రహ్మవేత్త సాక్షాత్ పరబ్రహ్మమే యగుచున్నాడో, దేవేంద్రునిచే కూడ వందనీయ మైన అట్టి నిరతిశయ బ్రహ్మానందమే నిక్కముగ జీవుని నిజస్వరూపము.
బ్రహ్మానందమను నిధి అహంకారమను సర్పముచే సంరక్షింప బడుచున్నదనియు, ఆ అహంకారమును తొలగించినచో మాత్రమే దివ్యానందాను భూతిని జనులు బడయగల రనియు, ఏ ఒకానొక ధీరుడో అత్మార్యమును సాధించి పరమానంద మనుభవించు చున్నాడనియు వివేక చూడామణిలో తెలుప బడినది.

*బ్రహ్మానంద రసాను భూతిని బడసిన మహనీయుల యొక్క అనుభవ వాక్యము లెన్నియో ఉపనిషత్తులందును, యోగ వాసిష్ఠమునందును, తదితర శాస్త్ర గ్రంథములందును చక్కగా పేర్కొన బడినది. వానిని పఠించినచో ఆత్మసాక్షాత్కారముచే జీవుడెట్టి మహదానందమును పొందుచుండునో స్పష్టముగ తెలియగలదు. జీవుని అంతరంగమున ఎంతటి మహోన్నత ఆనందము యొక్క అస్తిత్వము కలదో జనులు గుర్తెఱిగి పరమాశ్చర్యము నొందుచుందురు. ఆహా! మానవ జన్మయందిట్టి సమస్త ఆనందముల యొక్క పరాకాష్ఠయగు బ్రహ్మానందమును అనుభవించుటకు చక్కటి అవకాశ మేర్పడినది కదా యని మహానీయులు లోలోన సంతోషించు చుందురు.
*ఏ ఆనందసాగరము నుండి వెలువడిన చిన్న తుంపరలే సమస్త ప్రాణికోట్ల జీవనమై యలరుచున్నవో అట్టి బ్రహ్మానంద రూపుడగు పరమాత్మకు నమస్కారము.
- ధన ధాన్య సంపన్నుడును, సర్వులకు అధిపతియు, సమస్త మానవ భోగములతో కూడి యున్న వాడును అగు చక్రవర్తి యొక్క ఆనందము ఒక మనుష్యానందము, దానికి నూఱురెట్లు ఒక పితరుల ఆనందము. దానికి నూఱు రెట్లు ఒక గంధర్వ ఆనందము. దానికి నూఱు రెట్లు ఒక కర్మ దేవతల ఆనందము. దానికి నూఱు రెట్లు ఒక ఆజాన దేవతా నందము. దానికి నూఱు రెట్లు ఒక ప్రజాపతి లోక ఆనందము. దానికి నూఱు రెట్లు ఒక బ్రహ్మలోక ఆనందము, దానికి అనేక రెట్లు పరమానందము, బ్రహ్మానందము.
ప్రతి జీవియు లాభమునే కోరుచుండును, నష్టమును కాదు, సుఖమునే కోరుచుండును, దుఃఖమును కాదు.

*అశాశ్వతము లైనవి ఎంత గొప్పగా కనిపించినను అవి అల్పమయినవే అగును. ప్రపంచమున శాశ్వత మయినది ఒక్క పరమాత్మయే
*సామాన్య లాభముల కొఱకై జీవిత మంతయు ధారబోసి కర్మ రాశిని పెంచుకొనుచు జనన మరణ చక్రమునందు తగుల్కొని నానా యాతనలు అనుభవించుట కంటె ఉత్కృష్ట లాభమయిన పరమాత్మను బడసి బంధ రాహిత్యమును బొందుట శేయస్కరము కదా!
*ప్రపంచ వస్తువేదియు ఆత్మ వస్తువుతో సరిగాదు.
*ఎన్ని కష్టముల కోర్చియైనను, ఎన్ని ప్రయాసల నెదుర్కొనియైనను ఆత్మనే జీవుడు పొంద వలెను. అట్టి ఆత్మనే జీవితాంతములోగా అతడు సాక్షాత్కరించుకొనవలెను.
*దేహము లోపల పంచ కోశాంతర్గతమున మహా విలువగల ఆత్మ వెలయు చున్నది. దేహము బయట నశ్వరములగు నామ రూపములు నివాసమేర్పరచు కొనినవి. కనుకనే మహాత్ములు బాహ్య దృశ్య వస్తువుల యెడల విరాగము గలిగి అంతర్ముఖులై లోనగల పరమాత్మ యందు మనస్సును కేంద్రీకరించి, అద్దానిని బడసి ధన్యులగు చున్నారు.
*విజ్ఞులగువారు ప్రపంచములోని సారాసారములను చక్కగ వివేచించి సారమైన ఆత్మనే గ్రహించి అనాత్మ వస్తువులగు నామరూపము లందు వ్యామోహమును తొలగించి వేయుదురు.
*బృహదారణ్యకోపనిషత్తు నందు - ఆత్మనే చూడవలెను, వినవలెను, మననము చేయవలెను, నిధి ధ్యాసనము చేయవలెను. అని అసందిగ్ధమున చెప్పటబడినది.
*దీపమునకు మహత్తరమైన శక్తి కలదు . అంధకారమును పటాపంచలు చేయును, మరియు సదా ఊర్ధ్వ దృష్టినే కలిగియుండును. కావున ఊర్ధ్వదృష్టి, జ్ఞానదృష్టి దైవ

దృష్టిని కలిగియుండుడు, అధోదృష్టిని, అజ్ఞాన దృష్టిని
పాపదృష్టిని పారద్రోలుడు.
*దీపం వెలిగించుటకు కావలసిన వస్తువులు

- ప్రమిద, నూనె, వత్తి, అగ్గిపెట్టె

	వైరాగ్యము - అను ప్రమిద
జ్ఞాన దీపం	భక్తి - యను నూనె
	చిత్తైకాగ్రత - యను వత్తి
	తత్త్వవిచారణ - యను అగ్గిపెట్టె

*జ్ఞానదీపము వెలుగుటకు వైరాగ్యము మూలాధారము
*ప్రమిద దీపము కొద్దిసేపుండును. ప్రళయ కాలమువరకు
సూర్య చంద్రాది దీపములు వెలుగుచుండును. కాని ప్రళయ కాలమున
కూడా నశింపక, జాగ్రత్, స్వప్న, సుషుప్తుల లలో నందును తురీయ
మందును ఎల్లపుడు కూడ ఏకరీతి అవిచ్ఛిన్నముగ వెలుగుచుండు
దీపమొకటి కలదు . అదియే ఆత్మ. అదియే బ్రహ్మము. అదియే
పరంజ్యోతి.
*పెద్దల సాంగత్యముచే మాయ యొక్క మర్మమెఱింగి కీలు తెలుసుకొని
వాత పెట్టినట్లు, ఆత్మజ్ఞానము యొక్క సహాయము చే ఆ మాయను అంత
మొనర్చి ఆత్మ సామ్రాజ్యమునకు అధినేతలై వర్తించ వలయును.
*ఒక వస్తువును గ్రహించుటకు ముందుగా అది సత్యమైనదా? కాదా?
దానివలన మనుజునకు శాంతి సుఖములు కలుగునా లేదా? దానిలో
సుఖమెంత ? దుఃఖమెంత ? మానవ జీవితమునకు అది ఎంత ప్రయోజన
కరము? ఈ మొదలగు ప్రశ్నలను వేసికొనవలసి యుండును.
వివేకవంతు డగువాడు మొట్టమొదటి పని ఇదియే.
దృష్యప్రపంచము నందు రెండు దోషములు కలవు.

1 - నశ్వరత్వము - శాశ్వతము కాదు
2. పూర్ణ సుఖరాహిత్యము - ఏపదార్థము పూర్త సుఖమివ్వదు.
కాని మాయా ప్రభావముచే మనుజులకు దృశ్యప దార్థములందు నిగూఢములైయున్న ఈ దోశములు ఏమాత్రము కానవచ్చుట లేదు . అందు చేతనే వారు వాని వెంట పరుగిడుచు, అహర్నిశములు ఆ ప్రతి బింబ సుఖముల కొఱకే జీవితమును వెచ్చించుచు అమూల్యమైన మానవ జీవితమును వ్యర్థ పఱచు చున్నారు.
*మనస్సు యొక్క కదలికయే బంధనము . మనస్సు యొక్క నిశ్చలత్వమే మోక్షము.
*సాధకుడగు వాడు విచారణచే వస్తు తత్త్వమును తెలుసుకొని జడమును జడముగను, చైతన్యమును చైతన్యముగను గుర్తెఱింగి నశ్వరములగు దేహాది దృశ్య పదార్థములపై మమత్వమును, వ్యామోహమును విడనాడి, ప్రాపంచిక విషయ భోగముల యెడల విరాగ భావమును గలుగ జేసికొని మాయను దరికి చేర్చక సత్యమగు ఆత్మయందే మనస్సును నెలకొల్పి దివ్యమగు ఆనందాను భూతిని శీఘ్రముగ బడయుటకై యత్న శీలుడు కావలయును . మాయ తన యందు కల్పితమైన ఒకానొక వస్తువేయని నిశ్చయించి బలీయమగు ఆ మాయకు లోబడక దానికి అతీతుడై వర్తించవలెను. మాయా విజయమే మానవతకు చిహ్నము .
-వ్యాసులవారి సందేశము:
"ఓ! మానవులారా! ఓ ఉత్తమ జన్ములారా ! విషయ సుఖమే ప్రాణుల చరమ లక్ష్యమైనచో, వారు మానవులుగా పుట్ట నవసరంలేదు. ఏ క్రిమికీటకములుగ జన్మించినను ఫరవాలేదు అచట కూడ బోలెడంత విషయ సుఖము కలదు. అచట కూడ ఇంద్రియార్థములగు శబ్ద స్పర్శాదులను చక్కగ అనుభవించుటకు అవకాశము కలదు. మానవజన్మమో పరమార్థము

తెలిసికొనుటకు ఏర్పడినది. స్వస్వరూప సాక్షాత్కారమొనర్చుకొని జన్మ సార్థకత బడయుటకే మానవజన్మ భగవంతునిచే ప్రసాదింపబడినది. అట్టి అమూల్య జన్మను క్రిమికీటకాదు లనుభవించు ఐహిక సుఖమునకే వెచ్చించుట పాడికాదు. పశు వికారములందు పాడు చేయుట న్యాయము కాదు. దుర్వృత్తులకు లోను చేయుట ధర్మము కాదు . లెండు! తెలిసికొనుడు! ఆత్మసాక్షాత్కారమను మీ కర్తవ్యమును సాధించి సార్థక జన్మలు కండు.

*ఎవడు తన్నుతాను తెలిసికొని, తన హృదయమున వెలుగుచున్న ఆత్మజ్యోతిని సాక్షాత్కారము చేసికొనునో, ఎవడు పరమ పవిత్రమగు దైవానుభూతిని బడయునో, అట్టివాడే వాస్తవముగ పుట్టిన వాడు. ఎవనివలన వంశము, కులము,దేశము, ఉద్ధరింపబడునో అతడే పుట్టినవాడు, జన్మ సార్ధకత లేని జీవితము జీవితము కాదు.

****